క్లుప్తంగా

గురుకుల పాఠశాల కమిటీ సభ్యులకు సత్కారం



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సర్పంచ్ కన్నూరి దేవి తదితరులు

పరవాడ: తానాం గురుకుల పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను బుధవారం గ్రామ సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాథరావులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి కమిటీ శ్రమించాలని సర్పంచ్ కన్నూరి దేవి కోరారు. కార్యక్రమంలో ఆర్.నాగరాజు, మాధురి, మహాలక్ష్మి నాయుడు, లక్ష్మి, సోమునాయుడు, రేవతి, నాగలక్ష్మి, కె.రామారావు, కుమారి, కృష్ణవేణి, నూకరాజు, దేవి, కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు



పూజలందుకున్న అయ్యప్పస్వామి

పెందుర్తి: సుజాత నగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం గోత్రనామార్చనలతో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న కార్పొరేటర్ వసంత, విద్యార్థులు

పెందుర్తి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు అన్నారు. చినముషిడివాడ శాంతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ వార్డులో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, శానిటరీ సూపర్‌వైజర్ లాజర్, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని బాలాజీ గార్డెన్స్‌కు చెందిన గరిమెళ్ల సార్వ వెంకట లక్ష్మీనారాయణ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో విరాళాన్ని చెక్కు రూపంలో సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు బుధవారం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గి

గాజువాక: మాదక ద్రవ్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విద్యార్థులు కదం తొక్కారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాత గాజువాక జంక్షన్ నుంచి బయల్దేరిన ర్యాలీ సినిమా హాల్ కూడలి మీదుగా కొత్తగాజువాక వరకు కొనసాగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని వైద్య విద్యార్థి హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

శివారులో చోరీల అలజడి

- పెందుర్తిలో వరుస దొంగతనాలు
- భయాందోళనలకు గురవుతున్న ప్రజలు
- నేరాల కట్టడికి పోలీసుల చర్యలు



పెందుర్తిలో ఆదివారం చోరీకి గురైన ఏటీఎం



నేరాల నియంత్రణపై పెందుర్తిలో ప్రజలకు అవగాహన కలిగిస్తున్న సీఐ శ్రీనివాసరావు(ఫైల్)

పెందుర్తి: నగర శివారు ప్రాంతం పెందుర్తిలో దొంగలు చెలరేగిపోతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. నిత్యం ఏదో చోట అలజడి రేపుతూ తమ ఉనికిని చాటుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇళ్లను లూటీ చేస్తున్నారు. ఇంట్లో మనుషులు ఉన్నా.. చోరీలకు పాల్పడుతున్నారు. వరుసగా రెండు రోజుల వ్యవధిలో పెందుర్తి ప్రాంతంలో ఓ ఏటీఎంతోపాటు మూడు ఇళ్లల్లో చోరీ, రెండు బైక్‌లను దుండగులు మాయం చేశారు. ఆదివారం వేకువజామున పెందుర్తి నటరాజ్ థియేటర్ వద్ద ఏటీఎంను కొల్లగొట్టి రూ.19.70 లక్షలు దోచుకుపోయారు. సోమవారం అర్ధరాత్రి జనచైతన్య కాలనీలోని మూడు ఇళ్లల్లోకి చొరబడి దాదాపు 17 తులాల బంగారం, కిలోన్నర వెండి ఎత్తుకుపోయారు. రెండు బైక్‌లను కూడా మాయం చేశారు.

ప్రజల్లో గుబులు.. పోలీసుల పరుగులు

పెందుర్తి ప్రాంతం కొంతకాలంగా ప్రశాంతంగా ఉంది. ఇటీవల ఒక్కసారిగా ఉలిక్కిపడేలా వరుసగా ఈ ప్రాంతంలో దుండగులు హల్‌చల్ చేశారు. ఎంతో రద్దీగా ఉండే పెందుర్తి కూడలికి సమీపంలోని ఏటీఎంను కొల్లగొట్టడంతో ప్రజలతోపాటు పోలీసులు సైతం అవాక్కయ్యారు. అది జరిగి 24 గంటలు గడవక ముందే పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు దాదాపు కిలో మీటరు దూరంలో ఉన్న జనచైతన్య లేఅవుట్ గణేష్‌నగర్‌లో ఏకకాలంలో మూడిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో



పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో దొంగతనం జరిగిన ఇల్లు

పోలీసులు ఒక్కసారి గా అప్రమత్తమయ్యారు. దొంగతనాల కట్టడికి యు ద్ధప్రాతిపదికన రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు పెట్టి ప్రజలకు తగిన సూచనలిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశారు.

ప్రజలకు పోలీసుల సూచనలు, జాగ్రత్తలు

- దొంగతనాల నియంత్రణకు వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రజలకు పలు జాగ్రత్తలు, సూచనలు తెలియజేస్తున్నారు.
- దొంగతనాలు రాత్రి, పగలు కూడా జరుగుతున్నందున విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలి.
- అపార్ట్‌మెంట్లు, ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంట్లో పనిమనిషిని చేర్చుకునేటప్పుడు వారి ఫోన్ నంబర్, ఫొటో గుర్తింపుకార్డు తీసుకోవాలి.
- బ్యాంక్ నుంచి నగదు తెచ్చేటపుడు అపరిచిత వ్యక్తులు కింద నోట్లు పడేసి డబ్బు కాజేస్తారు. జాగ్రత్తగా వ్యవహరించండి.
- ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలు నగలు జాగ్రత్తగా చూసుకోవాలి.
- బంగారు నగలు మెరుగుపెడతామన్న వ్యక్తులను నమ్మొద్దు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- బ్యాంక్ అధికారులమని క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు అడిగినా చెప్పకూడదు.
- జీవీఎంసీ, జనాభా లెక్కల ఉద్యోగులమని చెబితే ముందుగా వారి ఐడెంటిటీ కార్డు అడగాలి. నేరుగా వాళ్లను ఇళ్లల్లోకి ఆహ్వానించడం ప్రమాదకరం. అనుమానముంటే నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వడం మంచిది.
- ప్రజలు ఇళ్లు వదిలి ఊరు వెళ్లినపుడు ఇంటి చిరునామా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి.
- అపరిచిత వ్యక్తుల సమాచారం కోసం: 1090, 100, సెల్: క్రైం సీఐ: 94409 04717, క్రైం ఎస్ఐ: 83310 41618, పీఎస్: 0891-2764233 నంబర్లలో సంప్రదించాలి.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోండి



శిక్షణ పూర్తి చేసుకున్న యువతతో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సిన్హా, అధికారులు

పరవాడ: యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా సూచించారు. సంస్థ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ(సీఐపీఈటీ, విజయవాడ) సహకారంతో 4వ బ్యాచ్ స్కిల్ డెవలప్‌మెంట్ విజయోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సిన్హా మాట్లాడుతూ సీఎస్సార్ కార్యక్రమాల ద్వారా సమాజ సంక్షేమానికి సింహాద్రి ఎన్టీపీసీ విశేష కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం, వివిధ సంస్థల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి సంస్థ పాటుపడుతోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఒక్కో బ్యాచ్‌లో 30 మంది అభ్యర్థులకు 6 నెలల పాటు మెషిన్ ఆపరేటర్స్-ఇంజెక్షన్ మోల్డింగ్, మోఫిన్ ఆపరేటర్స్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు సిన్హా చెప్పారు. కార్యక్రమంలో సీజీఎం(సీపీజీ-3) ఆర్.ఆర్.పరిధా, జీఎం నోవాహు గడ్డం, సంస్థ అధికారులు పద్మప్రియ, అనిత్‌కుమార్, శ్రీమంత మహాపాత్ర, కె.ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్, డాక్టర్ సిహెచ్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో నేరుగా కళాశాలకు వచ్చి ఈ నెల 22న అందజేయాలన్నారు. కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్యా వారి ఆదేశాల మేరకు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీ కోర్సుల్లో 50 శాతానికి పైగా మార్కులు సాధించాలని చెప్పారు. జనరల్ సబ్జెక్టుల్లో కామర్స్ విభాగంలో ఒక పోస్టు, పౌరశాస్త్ర విభాగంలో ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో మెకానికల్, ఆటో మొబైల్ టెక్నీషియన్‌లో ఒక పోస్టు, ఫిజియోథెరపీలో ఒక పోస్టు, కంప్యూటర్ సైన్స్, టెక్నీషియన్‌లో ఒక పోస్టును భర్తీ చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

పెందుర్తి: పట్టణ ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సూచించారు. పురుషోత్తపురంలోని ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వైద్యం కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు తగిన సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోరాడ చందుయాదవ్, నాయకులు ఆబోతు శ్రీను, రమణమూర్తి, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

కల్వర్టు పరిశీలన



కాలువపై పలకను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలో రామాలయం వీధిలో కాలువపై విరిగిపోయిన సిమెంటు పలక ఏర్పాటుకు పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టారు. కల్వర్టుపై పలక విరిగిపోయి, ప్రమాదకరంగా మారడంతో దీనిపై సాక్షి దినపత్రికలో ఈ నెల 20న 'ప్రమాదకరంగా కల్వర్టు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్, ఉప సర్పంచ్ గొంతిన రాము సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారులు కొత్త సిమెంటు పలక నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. త్వరలో కల్వర్టుపై కొత్త పలకను ఏర్పాటు చేస్తామని సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ చెప్పారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం బుధవారం కనులపండువగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



యర్రా రాఘవరావు(ఫైల్)

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో ఒక వ్యక్తి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. వంగలికి చెందిన యర్రా రాఘవరావు(32)కు పదేళ్ల కిందట అనకాపల్లి మండలం సింహాద్రిపురానికి చెందిన వసుదతో వివాహం జరిగింది. వారికి జశ్వంత్(7), కౌశిక్(3) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు 6 నెలల క్రితం వరకూ తన అత్తగారి గ్రామానికి సమీపంలోని చేనుల అగ్రహారానికి చెందిన ఒక వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన రాఘవరావు విపరీతమైన అప్పులు చేసేశాడు. ఇవన్నీ భరించలేక అతడి భార్య రెండేళ్ల కిందట పిల్లలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి స్వగ్రామంలో ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక భార్య, పిల్లలు తన వద్దకు రాకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నాడు. మనస్తాపంతో మంగళవారం వారి పశువుల పాకలో రాఘవరావు ఉరేసుకుని మృతిచెందాడు. తండ్రి పశువుల పాకలో కుమారుడి మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మృతుడి తండ్రి కొండబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు.

అప్పన్న వేద పాఠశాల సందర్శన



వేద విద్యార్థులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు, గొండు సీతారాం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంకి చెందిన వేద పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల వేద పాఠశాలలో కొంతమంది విద్యార్థులపై శారీరక దండనలు, అంతర్గత కుమ్ములాటలు జరగడం వంటి సంఘటనలు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దృష్టికి వెళ్లింది. దీంతో కమిషన్ చైర్మన్, సభ్యుడు వేద విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో చర్చించారు. జరిగిన సంఘటనలతోపాటు విద్యార్థులకు దేవస్థానం కల్పిస్తున్న భోజనం, వసతి సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గొండు సీతారాం మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం ప్రకారం విద్యార్థులపై శారీరక దండనలు చేయరాదన్నారు. విద్యార్థుల నుంచి తాము పలు విషయాలు సేకరించామని, పలు అంశాలపై రాష్ట్ర దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌లకు నివేదికలు అందజేస్తామని తెలిపారు.

ఎగసిన ఆగ్రహ జ్వాల

కోల్‌కతాలో మెడికో హత్యాచారంపై నిరసన



పినగాడిలో నిరసన తెలుపుతున్న నర్సింగ్ విద్యార్థులు

పెందుర్తి: కోల్‌కతాలో మెడికోపై జరిగిన హత్యాచారం ఘటనపై పెందుర్తి మండలం పినగాడిలో బుధవారం నిరసన జ్వాల ఎగసింది. ఈ ఘటనను ఖండిస్తూ బాధితురాలికి సంఘీభావంగా నాలుగు రోడ్ల కూడలిలో బీజేపీ, మహాత్మాగాంధీ బీఎస్సీ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాదేళ్ల జ్యోతి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండే వైద్యులు, సిబ్బందికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యుల కోసం జాతీయ స్థాయిలో రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



పరవాడలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పరవాడ: కోల్‌కతాలో పీజీ ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరవాడ గ్రామంలో బుధవారం భారీ మానవహారం నిర్వహించారు. ఈ దురాగతానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. నేరస్తులను శిక్షించాల్సిందేనని నినదించారు. బెంగాల్ ప్రభుత్వం అసలు దోషులను వదిలిపెట్టి, ఒక్కరిని మాత్రమే అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందని, పని ప్రదేశాల్లోనే కాకుండా ఇళ్లలోనూ రక్షణ కరువైందని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు భారతావని సిగ్గుపడేలా ఉన్నాయన్నారు. గతంలో ఢిల్లీలో జరిగిన నిర్భయ వంటి ఘటనలు ఎన్ని జరిగినా నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కె.ప్రశాంతి, అనిత, లావణ్య, గౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై విశ్వహిందూ పరిషత్ నిరసన



అప్పన్న తొలిపావంచా వద్ద నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

సింహాచలం: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ బుధవారం సింహాచలం కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర మహానగర్ నిరసన వ్యక్తం చేసింది. ఈ ఘాతుకానికి పాల్పడిన నీచులను వెంటనే ఉరితీయాలని వీహెచ్‌పీ సభ్యులు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న హత్యాచార సంఘటనలు మానవుల హృదయాలను కలచివేస్తోందన్నారు. ఒక మహిళను అతి కిరాతకంగా చంపిన దుండగులకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి కొమ్ముకాయడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. చట్టాలు ఉన్నా వాటిని సక్రమంగా అమలు పరచకుండా కొందరు రాజకీయ నాయకులు వారికి అనుకూలంగా మార్చుకుంటున్న సందర్భాలు ఉన్నాయని, మానవ హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి కీచక సమాజంలో ప్రతి మహిళ మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలని అవసరం ఎంతో ఉందన్నారు. దేశంలో జరుగుతున్న మహిళలపై అత్యాచారాలకు మానవ హక్కుల ఉల్లంఘనలకు, విదేశీయుల దురాక్రమణలకు వ్యతిరేకంగా ప్రతీ ఒక్క భారతీయుడు పోరాడాలని, సమాజం ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు బి.నాగభూషణం, మీసాల రవీంద్ర, మాడెం రామకృష్ణ, జయరాజ్, పూడిపెద్ది శర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థుల భారీ ర్యాలీ



న్యాయ విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాశరావు తదితరులు

సబ్బవరం: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాల, హాస్పిటల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై యావత్తు దేశమంతా దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. లా యూనివర్సిటీ మానవ హక్కులు, విధుల సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో న్యాయ విద్యార్థులంతా భారీ ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి తీర్పునిచ్చిందన్నారు. ఇటువంటి ఘటనలతో మానవజాతికి ఒక కనువిప్పు కలగాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సాటి మనిషిగా మానవత్వంతో చైతన్యం రావాలని సూచించారు. మరో అతిథి విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ హెచ్‌వోడీ, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత గుట్ల మాట్లాడుతూ స్వాతంత్య్ర దిన వేడుకలకు వారం రోజుల కిందట ఇటువంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. దేశంలో ప్రతి 15 నిమిషాలకు ఒక మహిళ లైంగికదాడికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒక మహిళ విషయంగా కాకుండా మానవత్వానికి చెందినదిగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు.

కార్యక్రమంలో భాగంగా న్యాయ విద్యార్థులంతా ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో వీధి నాటకం ప్రదర్శించారు. కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ కన్వీనర్, కో కన్వీనర్లు డాక్టర్ కె.సుధ, డాక్టర్ టి.వై.నిర్మలాదేవి, ఆర్గనైజింగ్ కమిటీ విద్యార్థులు కృష్ణ విజయ్, సహిస్న, సుభం, చందన శ్రియ, పనితవ్య తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' తీరుతో భవన నిర్మాణ కార్మికులు కుదేలు



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

పెందుర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీ కారణంగా భవన నిర్మాణ కార్మికుల పనులకు గండి పడి వారి జీవితాలు కుదేలవుతున్నాయని ఏఐటీయూసీ నేత ఆర్.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీకి నిరసనగా బుధవారం చినముషిడివాడ కూడలి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ వల్ల సామాన్యుల కంటే దళారులు బాగుపడుతున్నారని విమర్శించారు. ఉచిత ఇసుక కదా అని సామాన్యులు రీచ్‌కు వెళితే రెండు మూడు రోజుల పాటు అక్కడే వేచి ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇసుకను ఉచితంగా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ముత్యమాంబ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు వై.రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.